గుంతల రోడ్డుతో తిప్పలు



గుంతలమయంగా రహీంఖాన్‌పేట రోడ్డు



- అధ్వానంగా రహీంఖాన్‌పేట, వెల్జిపూర్ రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- రోడ్డు పనులు చేపట్టాలని విజ్ఞప్తి

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట నుంచి వెల్జిపూర్ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. ఇల్లంతకుంట నుంచి సిరిసిల్లకు ఈ రోడ్డు గుండా వెళ్తే దూరభారం తగ్గుతుంది. నిత్యం వాహనదారులు ఈదారి గుండా రాకపోకలు సాగిస్తుంటారు. 2021 ఆగస్టులోరహీంఖాన్‌పేట నుంచి తంగళ్లపల్లి వరకు 16 కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డుగా మార్చేందుకు ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రూ.9.84లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. రహీంఖాన్‌పేట వెల్జిపూర్ గ్రామాల చివరన కాళేశ్వర ప్రాజెక్టులు పనులు చేపట్టగా భారీ వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుండటంతో కాంట్రాక్టర్ ఈ రహదారి పనులు వదిలిపెట్టి వెల్జిపూర్ చివరనుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. 5 కిలోమీటర్ల వరకు డబుల్ రోడ్డువేసి పనులు నిలిపివేశారు. మళ్లీ ఆరునెలల క్రితం పనులు ప్రారంభించి మరో మూడు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాడు. మొత్తం 16 కిలోమీటర్ల ఉన్న రోడ్డులో ఎనిమిది కిలోమీటర్ల వరకు మాత్రమే రోడ్డుపనులు పూర్తిచేసి మిగతా వదిలేశారు. రహీంఖాన్‌పేట నుంచి వెల్జిపూర్ వరకు బీటీ లేచిపోయి రోడ్డంతా గుంతలమయమైంది. దీంతో వాహనదారులు ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే జంకుతున్నారు. వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేసేలా నాయకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని మండలప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



రోడ్డుపనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తోంది. భారీ వాహనాలకు రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇంతవరకు పనులు పూర్తికాలేదు. వెంటనే రహదారి నిర్మాణ పనులు పూర్తిచేసి ఇక్కట్లు తొలగించాలి.

– బిళ్లవేని పరుశురాం, రహీంఖాన్‌పేట

ఇబ్బంది పడుతున్నాం



వాహనదారులు ఏమాత్రం వాహనాలు వేగంగా నడిపినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పనులను మధ్యలోనే నిలిపివేయడంతో ఏళ్లగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే కాంట్రాక్టర్ రహదారి పనులు త్వరగా పూర్తిచేయాలి.

–రాగుల భూమయ్య, ఎర్ర నర్సుపల్లె, ఇల్లంతకుంట



చందుర్తి : మండలంలోని ఎన్గల్ గ్రామ శివారులో రోడ్డుపై చెట్టు కొమ్మలు విరిగిపడి రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అయినా తొలగించే దిక్కు లేకుండాపోయారు. రాత్రిపూట ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు వాటిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ, చందుర్తి సెల్ నెం: 9866179335

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

క్లుప్తంగా

ఫీజుల దోపిడీ అరికట్టాలి



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠ రెడ్డి

సిరిసిల్లటౌన్: అక్షరాలతో రూ.లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలను కట్టడి చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని కార్మిక భవనంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయడం లేదని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే డిగ్రీ పరీక్షలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాకేశ్, కార్యదర్శి మంద అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీజ, ఆదిత్య జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్, రజినికాంత్, నిశాంత్,కౌశిక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వారణాసిలో సిరిసిల్ల కళాకారుల ప్రతిభ



నృత్య ప్రదర్శనలో కళాకారులు

సిరిసిల్లటౌన్: అయోధ్య, వారణాసిలో సిరిసిల్ల లంబోదర కల్చరల్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈనెల 2న కాశీ విశ్వనాథ్, అయోధ్యలో జరిగిన నృత్య కళోత్సవంలో వారు పాల్గొన్నారు. అస్సిఘాట్, గంగాహారతి దగ్గర సుబాహ్ బనారస్, వారణాసి వారు నిర్వహించిన నృత్య ఉత్సవంలో 50 మంది కళాకారుల ప్రదర్శన ఇచ్చారు. చిన్నారి కళాకారులకు సుబాహ్ బనారస్ డాక్టర్ రత్నేశ్ వర్మ, సీమ కేశరి సర్టిఫికెట్స్, శ్రీలంబోదర కల్చరల్ అకాడమీకి జాతీయస్థాయి కాశీవిశ్వేశ్వర అవార్డు అందజేశారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నక్క అశోక్, అంతర్జాతీయ కళాకారులు అరుణ్‌సాయి, ఈట శ్రీరాజ్, లక్ష్మి ప్రణవీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సేవలందించడమే సహకార సంఘం లక్ష్యం



మాట్లాడుతున్న ఏనుగు తిరుపతిరెడ్డి

వేములవాడఅర్బన్: రైతులకు సేవలందిచడమే లక్ష్యంగా సహకార సంఘం పనిచేస్తుందని వేములవాడ ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి అన్నారు. వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో డైరెక్టర్లతో బుధవారం సమావేశమయ్యారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల అంశంపై డైరెక్టర్లతో చర్చించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటివరకు 63వేల 466 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వైస్ చైర్మన్ లక్ష్మీకాంతరావు, డైరెక్టర్లు రాజు, వెంకటేశం, అమృత, మల్లేశం సీఈవో లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఆలయ వార్షికోత్సవం



చందుర్తి: మండలకేంద్రంలోని షిరిడీ సాయి బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా వేదపండితులు సద్గుచారి మంత్రోచ్చారణ, ఆలయ ఆవరణలో హోమం పూజలను నిర్వహించారు. ఆలయ దాత పుల్లూరి మల్లేశం దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ సత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పోంశెట్టి తిరుపతి, నాయకులు రామస్వామి, ముస్కు ము కుందరెడ్డి, పులి సత్తయ్య, తిప్పని శ్రీనివాస్, పోతురాజు రవి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేటలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయంలో చేపట్టిన పెద్దమ్మ, పెద్దిరాజుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో బీజేపీ పార్టీ వేములవాడ నియోజక వర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకులు చెన్నమనేని వికాస్‌రావు పాల్గొని బుధవారం ప్రత్యేక పూ జలు చేశారు. పార్టీ నాయకులు సిరికొండ శ్రీనివాస్, పోంశెట్టి రాకేశ్, సిర్రం తిరుపతి, విజేందర్, జీవన్, జలేందర్, గంగరా జు, రంజిత్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ సామాజిక తనిఖీ'

వీర్నపల్లి: మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధిహామీ సామాజిక తనిఖీ బుధవారం నుంచి కొనసాగుతున్నాయి.ఉపాధి హామీ సిబ్బందితో పాటు సామాజిక తనిఖీ బృందం సభ్యులు చేసిన పనులకు కొలతలు తీసుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం రహీంఖాన్‌పేట ప్రజా వేదిక, వెల్జిపూర్, ఓబులాపూర్లో ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతారం ప్రాజెక్టు నుంచి రహీంఖాన్‌పేట సింగరాయకుంటకు వచ్చే ఫీడర్ ఛానల్‌కు సీసీలైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. కాగా, సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే ఎల్ఎం– 6 కెనాల్ పూర్తి చేసేందుకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెల్జిపూర్‌లో రూ.12 లక్షలతో అంగన్వాడీ భవనం, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆన్ వీల్స్ యాప్‌లో సమస్యలు పంపిస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె.భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఎంఏ ఫారుక్, ఎంపీడీవో శశికళ, సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి, డాక్టర్ జీవనజ్యోతి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేశ్, పీఆర్ ఏఈ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న రాగుల రాములు

సిరిసిల్లటౌన్: జిల్లాలో అంగన్‌వాడీ పోస్టుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని జాతీయ మాల మహానాడు కార్యదర్శి రాగుల రాములు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి ఆరోపణలున్న వారిపై వెంటనే కలెక్టర్ విచారణ చేపట్టాలని కోరారు. గొట్టె లింబాద్రి, యెలిగేటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బోయినపల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండలంలోని రత్నంపేటలో ఇంటర్, పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కల్లెపెల్లి చైతన్య, ఎదురుగట్ల శ్రీజ, ఏడిద సింధూజ, శరణ్య, ఐశ్వర్య, భవాని, సాయిశృతి, మన్మిత, రుచిత, లోకేశ్, శశాంక్, చరణ్ తదితర విద్యార్థులను బుధవారం అభినందించారు. మహ్మద్ అజ్జూ, బత్తిని కమల్, సాగర్, కృష్ణమూర్తి, గురిజాల కోటి, గొండ సుధాకర్, బాలకిషన్, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేశ్, అక్షయ్, లింగారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణం

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఇరువురిని సత్కరించారు.

ఇందిరమ్మ ఇళ్లపై విచారణ జరపండి



ఆందోళన చేస్తున్న మహిళలు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ గ్రామ పంచాయతీ ఎదుట మహిళలు బుధవారం ధర్నా చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయంటూ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామసభలో ఎంపిక చేసిన జాబితాను కాదని, ఇతరులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని లచ్చిగారి శంకరవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. మొదటి జాబితాలో తమ పేర్లను ఉంచిన అధికారులు.. ఇప్పుడు తొలగించారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు విచారణ జరిపి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అఫర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీ తీర్మానం మేరకు అర్హుల జాబితాను సిద్ధం చేశారన్నారు. మరోసారి విచారణ చేపడుతామని పేర్కొన్నారు. ఇక్కడ కేసుగాని లస్మవ్వ, సుజాత, లచ్చిగారి ఎల్లవ్వ, గొడిశెల రాజేశ్వరి, సడిమెల ఎల్లవ్వ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

ముస్తాబాద్: పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై బీజేపీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి నినాదాలు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్, పట్టణాధ్యక్షుడు మెంగని మహేందర్, శ్రీనివాస్‌రావు, రమేశ్‌రెడ్డి, మీస సంజీవ్, మీస శంకర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై బీజేపీ మండల నాయకులు బుధవారం పలు గ్రామాల్లోని ఆలయాల్లో పూజలు నిర్వహించారు.

సంక్షిప్త వార్తలు

● తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

ఎల్లారెడ్డిపేట: అకాలవర్షంతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. తడిసిన ధాన్యంపై రైతులు ఆందోళన చెందొద్దన్నారు.

● లారీలు రాక రైతుల ఇబ్బందులు

వీర్నపల్లి: మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిసిందని జిల్లా రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...కొనుగోలు కేంద్రాల్లో 20 రోజులైనా ధాన్యం తూకం వేయకపోవడం, లారీలు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

● త్వరలోనే శంకుస్థాపన చేస్తాం

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు.

● ఉచిత నేత్ర వైద్యశిబిరం

బోయినపల్లి: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో చక్రవర్తి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్యులు వినయ్ చక్రవర్తి, సిబ్బంది ఉన్నారు.

● తెగిపడిన విద్యుత్ వైర్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని మూడుగుళ్ల వద్ద బుధవారం మెయిన్ లైన్ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఆ సమయంలో దారివెంట వాహనదారులు, ప్రయాణికులు ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గ్రామస్తులు వెంటనే సెస్ అధికారులకు సమాచారం అందించగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

● ఈదురుగాలులకు కూలిన ఇల్లు



వీర్నపల్లి: మండలావ్యాప్తంగా బుధవారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగిపడడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. మద్దిమల్లతండాకు చెందిన జరుపుల రవికి చెందిన రేకుల ఇల్లు ఖూలిపోయింది.

● క్రీడలతో స్నేహభావం పెంపు

ఎల్లారెడ్డిపేట: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని మాజీ సర్పంచ్ బాల్‌రాజు నర్సాగౌడ్ అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో బుధవారం జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. పోటీల్లో దుమాల ప్రథమ స్థానంలో, బదనకల్ ద్వితీయ స్థానంలో రాణించారు. ప్రథమ స్థానంలో రాణించిన జట్టుకు రూ. 20వేల నగదు, షీల్డ్, ద్వితీయ స్థానంలో రాణించిన జట్టుకు రూ.10వేల నగదు, షీల్డ్‌ను నర్సాగౌడ్ అందజేశారు. కార్యదర్శి కృష్ణ, నాయకులు రాజు, దేవయ్య, మాచర్ల బాలకిషన్, బొడ్డు తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

● ఘనంగా కుంకుమ పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం వాసవిమాత జయంతిని పురస్కరించుకొని సామూహిక కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయంలో పుణ్యహవచనం, గణపతిపూజ, అర్చన, అలంకరణ పూజలు చేశారు. 50 మంది మహిళలతో కుంకుమపూజలు చేసి, అమ్మవారికి శేషవస్త్రం సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గుండ చిన్నమల్లేశం, కోశాధికారి రాజేశం, సభ్యులు అంజయ్య, నగుబోతు రాము, ఆంజనేయులు, బచ్చు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డిపేట : మాట్లాడుతున్న ఎంఈవో

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో కృష్ణహరి కోరారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, రాచర్లగొల్లపల్లి, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను బుధవారం ఎంఈవో ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పదో తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన రాచర్లబొప్పాపూర్ హైస్కూల్ విద్యార్థులను మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గెంటె లత, హెచ్ఎం మనోహరాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వం నిర్వహించే వేసవి ప్రత్యేక శిబిరంతో విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని ఎంఈవో నిమ్మ రాజిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల డైనింగ్ హాల్‌లో భరతనాట్యం, కూచిపూడి నృత్యాలపై శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే చెస్, వాలీబాల్ ఇతర ఆటలపై శిక్షన ఇవ్వనున్నట్లు తెలిపారు. చేతిరాతతోపాటు యోగా, డ్రాయింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న వార్పిన్ కార్మికులు

సిరిసిల్లటౌన్: వార్పిన్ కార్మికుల పట్ల యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పవర్‌లూమ్స్ వర్కర్స్ అసోసియేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ అన్నారు. కార్మికులకు పనికి తగిన వేతనాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం ఎదుట ధర్నా చేపట్టగా ఆయన మాట్లాడారు. యజమానుల వైఖరిని నిరసిస్తూ రెండ్రోజులుగా కార్మికులు సమ్మెబాట పట్టినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యజమానులు తమ లాభాల గురించి ఆలోచిస్తున్నారు తప్ప కార్మికులకు మెరుగైన వేతనం అందించాలని ఆలోచన చేయడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పవర్లూమ్ వర్కింగ్ వైపని కార్మికులకు న్యాయమైన కూలి నిర్ణయించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల వైఖరి నిరసిస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని కార్మికుల యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, ఉడుత రవి, మచ్చ వేణు, ఒగ్గు గ ణేశ్, ఎలిగేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం



కల్యాణ వేడుకల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి: మండలంలోని జోగాపూర్‌లో నిర్వహించిన బీరప్ప కామరాతి కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించాచారు. ఉదయం బియ్యం, సుంకు, డోలు చప్పుళ్లు, ఒగ్గు కళాకారుల విన్యాసాల మధ్య యాదవులు దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం లింగాలకు గంగస్నానం చేయించి, ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయ ఆవరణలో పెద్ద పట్నం వేసి బీరప్ప కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు తరలివచ్చారు. బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తుల ఉమ, న్యాలకొండ రాఘవరెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని రుద్రవరంలో శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి జమదగ్ని మునిరాజుల బోనాల మహోత్సవంలో భాగంగా అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు.

అభిషేకాలు, కుంకుమార్చనలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ముస్తాబాద్: మండలకేంద్రంలో కన్యాక పరమేశ్వరి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పురాతన శివాలయంలో కన్యాక పరమేశ్వరి ఉత్సవ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కలశాలతో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ప్రత్యేక పూజలతో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు కూర సంతోష్, కూర భిక్షపతి, గందె రమేశ్, విజయ్‌కుమార్, ఉప్పల చంద్రం, నార్ల శ్రీను, కొండాపూర్ రాజు, శంకరయ్య, శ్రీనివాస్, నందం, పద్మజ, మేఘమాల, సుజాత, లలిత, దివ్య, అనురాధ, రాణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డీఏవో అఫ్జల్ బేగం

బోయినపల్లి: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించి లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తడగొండలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించగా, ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. జిల్లా పట్టు పరిశ్రమ ఉద్యాన అధికారి లత, అసోసియేట్ డీన్ కేబీ.సునీతాదేవి, ఏడీఏ రామారావు, శాస్త్రవేత్తలు ఉషారాణి, మదన్‌మోహన్‌రెడ్డి, ఎంఏవో కె.ప్రణీత, పశువైద్యాధికారి సతీశ్, ఉద్యాన అధికారి లోకేశ్, మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, నాయకులు గుడి శ్రీనివాసరెడ్డి, గుడి రాజశేఖర్‌రెడ్డి, రమేశ్, ఉయ్యాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గిద్దె చెరువు ప్రాంతానికి వారసంత

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గిద్దె చెరువు ప్రాంతానికి ప్రతి శుక్రవారం నిర్వహించే వారసంతను మార్చుతున్నట్లు ఎంపీడీవో సత్తయ్య అన్నారు. 'సాక్షి' దినపత్రికలో బుధవారం 'రోడ్డుపైనే వారసంత' అనే శీర్షికతో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గ్రామసభ నిర్వహించి సంత మార్పిడిపై గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. తొందరలోనే గిద్దె చెరువు ప్రాంతాన్ని చదును చేసి ప్రతి వారం వారసంతను గిద్దె చెరువు వద్దకు మార్చుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు

సైబర్ నేరాలపై అవగాహన

బోయినపల్లి: మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సైబర్ క్రైం, డయల్ 100పై ట్రెయినీ ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలకు యువకులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగ్‌పై అవగాహన కల్పించారు. బోయినపల్లి నుంచి కొదురుపాక వెళ్లే రోడ్డులో ఈదురు గాలులకు చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ట్రెయినీ ఆధ్వర్యంలో చెట్లు తొలగించడంతో రాకపోకలకు ఇబ్బంది తొలగింది.

పోస్టర్లు ఆవిష్కరణ

వీర్నపల్లి: మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాలత్ లక్పతి నాయక్ ఆధ్వర్యంలో హిందూ ఏక్తా యాత్ర పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు లింబాద్రి, మహేశ్, జి. ప్రశాంత్, వెంకటేశ్, రఘుపతి, ఎల్. రాజు, ప్రకాశ్, పాల్గొన్నారు.